## క్లుప్తంగా

### 108 వాహనంలో ప్రసవం



ఆడశిశువుతో ఈఎంటీ తిరుపతయ్య

చిలుకూరు: పురిటి నొప్పులతో బాధపడుతున్న మహిళను 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రసవించింది. చిలుకూరు మండలంలో శనివారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చెన్నారిగూడేనికి చెందిన బొడ్డుపల్లి భవానికి శనివారం రాత్రి 10 గంటల సమయంలో పురిటి నొప్పులు వచ్చాయి. వెంటనే కుటుంబ సభ్యులు చిలుకూరు 108కి సమాచారం ఇవ్వగా వారు వచ్చి భవానిని ఆస్పత్రికి తీసుకొస్తుండగా నొప్పులు అధికం కావడంతో వాహనంలోనే ఈఎంటీ తిరుపతయ్య ప్రసవం చేశారు. ఆడ శిశువుకు జన్మనిచ్చింది.అనంతరం తల్లీబిడ్డను హుజూర్‌నగర్ ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. భవాని కుటుంబ సభ్యులు108 సిబ్బంది రాంబాబుకు, తిరుపయ్యకు ధన్యవాదాలు తెలిపారు.

### దేవస్థానం కమిటీ చైర్మన్‌గా శ్రీనివాస్



పోలిశెట్టి శ్రీనివాస్

మునగాల: మండంలోని బరాఖత్‌గూడెం శివారులో గల స్వయంభూ వేంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్‌గా గ్రామానికి చెందిన వ్యాపారవేత్త పోలిశెట్టి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి గ్రామంలోని అన్ని వర్గాల ప్రజల సహాయ,సహకారాలతో కృషిచేస్తానన్నారు. వచ్చేనెల 10న జరుగనున్న ఉత్తర ముఖద్వార దర్శనం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, గ్రామస్తులకు అయన కృతజ్ఞతలు తెలిపారు.

### గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు



యువతకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ

నేరేడుచర్ల : గంజాయి తాగినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని నేరేడుచర్ల ఎస్‌ఐ రవీందర్‌నాయక్ హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గతంలో గంజాయి సేవించిన యువతకు కౌన్సింగిల్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తుపదార్థాలతో భవిష్యత్ నాశనం అవుతుందని, ఆర్థికంగా నష్టపోతారని అన్నారు. ప్రమాదకరమైన మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు.

### కుటుంబానికి అండగా.. స్నేహ హస్తం



నాగుల్‌మీరా కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న తోటి మిత్రులు

పాలకవీడు: మండలంలోని బొత్తలపాలెం గ్రామానికి చెందిన ఎస్‌కె.నాగుల్‌మీరా ఇటీవల జరిగిన ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించేవాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. పేదరికంలో ఉన్న నాగుల్‌మీరా కుటుంబానికి డ్రైవర్‌గా పని చేస్తున్న స్నేహితుతులు ఆర్థికంగా స్నేహ హస్తం అందించారు. మిత్రులు రూ. 67,000లు సమకూర్చి ఆ కుటుంబానికి అందజేశారు.

### పదకొండేళ్లుగా అన్నదానం.. అభినందనీయం



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న దాతలు

కోదాడరూరల్ : పదకొండేళ్లుగా మాలధారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని అఖిల భారత అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షుడు రాజ్‌దేశ్‌పాండే అన్నారు. ఆదివారం పట్టణంలోని హుజూర్‌నగర్‌రోడ్‌లోని గాలి రమేష్‌నాయుడు అయ్యప్ప సన్నిధానంలో అర్వపల్లి సత్యనారాయణ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అన్నిదానాల్లోకెల్ల అన్నదానం గొప్పదని, దాతలు ఇలాంటి కార్య క్రమాలకు ముందుకు రావడం సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు గాలి శ్రీనివాస్‌నాయుడు, మిత్రమండలి సభ్యులు తదితరులు ఉన్నారు.

# పబ్లిక్ క్లబ్‌కు మళ్లీ పాత కార్యవర్గమే!

- వచ్చే ఫిబ్రవరి వరకు కొనసాగింపు
- సర్వసభ్య సమావేశంలో నిర్ణయం
- సభ్యత్వాలు పెంచడానికి సూత్రప్రాయ అంగీకారం



కోదాడ పబ్లిక్ క్లబ్

కోదాడ: పబ్లిక్‌క్లబ్ పగ్గాలను మళ్లీ పాత కార్యవర్గానికి అప్పగించారు. రెండు నెలలుగా పట్టణంలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన కార్యవర్గ మార్పు టీ కప్పులో తుపానులా చల్లారిపోయింది. రెండు నెలల క్రితం జరిగిన సర్వసభ్య సమావేశంలో రద్దు చేసిన కార్యవర్గాన్నే ఆదివారం జరిగిన సమావేశంలో తిరిగి కొనసాగించాలని నిర్ణయించారు. ఈ కార్యవర్గం ఫిబ్రవరి 2026 వరకు కొనసాగనుంది. ఈ సంవత్సరం ఫిబ్రవరి నెలలో గాయం పట్టాభి రెడ్డి అధ్యక్షుడిగా, బొల్లు రాంబాబు కార్యదర్శిగా 15మందితో కూడిన నూతన కార్యవర్గం బాధ్యతలు చేపట్టింది. ఆరు నెలల వరకు సక్రమంగానే ఉన్న కార్యవర్గంలో ఆ తరువాత అధ్యక్షుడు, కార్యదర్శికి మధ్య వచ్చిన విభేదాలతో అధ్యక్షుడు మినహా ఇతర కార్యవర్గ సభ్యులు రాజీనామా చేశారు. దీంతో అక్టోబర్ నెలలో క్లబ్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించి మొత్తం కార్యవర్గాన్ని రద్దు చేసి డిసెంబర్ 29న నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని గతంలో నిర్ణయించారు.

**పాతకార్యవర్గం వైపే మొగ్గు..**

క్లబ్ ఆడిటోరియంలో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ముఖ్యులు కూర్చొని నూతన కార్యవర్గం ఎన్నిక తలనొప్పిగా మారే అవకాశం ఉందని, పదవుల కోసం పలువురు పోటీ పడుతున్నందున ఏకగ్రీవ అవకాశాలుండవని, అందువల్ల పాత కార్యవర్గాన్నే కూర్చోపెట్టి సర్దుబాటు చేసి వారినే కొనసాగించడం మంచిదని నిర్ణయించినట్లు సమాచారం. దీంతో పాత కార్యవర్గాన్నే కొనసాగిస్తున్నట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన న్యాయవాది ఎస్. ఆర్‌.కె. మూర్తి ప్రకటించారు. కార్యవర్గ సభ్యులు ఎలాంటి వివాదాలు లేకుండా క్లబ్ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ప్రకటించారు.

**నూతన సభ్యత్వాలకు గ్రీన్ సిగ్నల్?**

ఇదిలా ఉండగా ప్రస్తుతం క్లబ్‌లో 200 మంది సభ్యులున్నారని, కొన్నేళ్లుగా సభ్యుల సంఖ్యను పెంచాలనే డిమాండ్‌ను సమావేశంలో సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలిసింది. సభ్యుల సంఖ్యను పెంచాలని కొందరు కోర్టులను ఆశ్రయించే అవకాశం ఉన్నట్లు తమకు సమాచారం ఉందని, ఆలోగానే సభ్యత్వాలను పెంచాలని నిర్ణయించారు. ప్రస్తుతం 200 మంది సభ్యులున్నందున ఇద్దరు సభ్యులు కలిసి ఒకరిని సిఫార్సు చేసే విధంగా మరో 100 మంది నూతన సభ్యులను చేర్చుకోవాలని నిర్ణయించడంతో పాటు సభ్యత్వ రుసుం కూడా భారీగా నిర్ణయించే అవకాశం ఉందని క్లబ్ సభ్యులు కొంత మంది అంటున్నారు. దీనిపై కొద్దిరోజుల్లో స్పష్టత వచ్చే అవకాశముంది.

## వైభవంగా మహాసుదర్శన యాగం



సుదర్శన యాగం నిర్వహిస్తున్న వేదపండితులు



స్వామివారికి అభిషేకం చేస్తున్న వేదపండితులు

నేరేడుచర్ల : ధనుర్మాసోత్సవాల్లో భాగంగా నేరేడుచర్లలోని శ్రీకోదండ రామాలయంలో ఆదివారం మహా సుదర్శనయాగం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మొలుగు శ్రీనివాస చార్యులు ఆధ్వర్యంలో వెంకటరమణ శర్మ బృందంలోని ఎనిమిది మంది వేద పండితులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గోదారంగనాథస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యగ్నశాల వద్ద పలువురు దంపతులు యజ్ఞం చేశారు. ఈ మహా యజ్ఞానికి నేరేడుచర్ల పరిసరాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చితీర్థ, ప్రసాదాలను స్వీకరించారు. యాగంలో పులిజాల వెంకటరమణారావు, తడకమళ్ల నర్సింహ్మస్వామి, మురారిశెట్టి రమేష్, గోళ్ల సుధాకర్, నిమ్మగడ్డ సుబ్బారావు, రాగిరెడ్డి గోపాల్‌రెడ్డి, నిమ్మగడ్డ సుబ్బారావు, పోలిశెట్టి శ్రీనివాస్‌రావు, వీరమళ్ల సత్యనారాయణ, మాశెట్టి సైదయ్య, మోహన్, సైదులు, కందిబండ శ్రీనివాస్‌రావు, జగిని సురేష్, సైదాచారి, వంకాయల శ్రీనివాస్‌రావు, అంజయ్య, జానయ్య దంపతులు పూజలు చేశారు. కార్యక్రమంలో ఉప్పల కృపాకర్, రాచకొండ రాంమోహన్‌రావు, మురారిశెట్టి రమేష్, రత్నం తదితరులున్నారు.

## పట్టా భూమిని ప్రభుత్వ భూమిగా చిత్రీకరిస్తున్నారు



సమావేశంలో మాట్లాడుతున్న రైతులు

కోదాడరూరల్ : మండల పరిధిలోని కూచిపూడిలో గల సర్వే నంబర్ 225లో గల 9 ఎకరాల పట్టా భూమిని అధికారులు ప్రభుత్వ భూమిగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నారని పలువురు రైతులు వాపోయారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 1954 సంవత్సరం నుంచి సర్వే నంబర్ 225లో 9 ఎకరాలకు పట్టాలు ఉంటే అధికారపార్టీ నాయకులకు తలొగ్గి సర్వే చేయకుండానే ప్రభుత్వ భూమి అంటున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు శనివారం సర్వేకు వచ్చిన ఆర్డీఓ తమను అసభ్య పదజాలంతో దూషించారని ఆరోపించారు. పట్టా భూమిని ప్రభుత్వ భూమి అంటున్న అధికా రులు, దూషించిన ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శెట్టి సురేష్, శెట్టి రమేష్, ముత్యం సతీష్, శెట్టి వెంకటనారాయణ,శెట్టి చంద్రయ్య, శెట్టి సత్యనారాయణ, గోపి, తిరపతయ్య ఉన్నారు.

## చెరువును రిజర్వాయర్‌గా మార్చాలని వినతి



నీటిపారుదలశాఖ అధికారులకు సమస్యను విన్నవిస్తున్న నాయకులు, ప్రజలు

పాలకవీడు: జాన్‌పహాడ్ చెరువును రిజర్వాయర్‌గా మార్చాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎన్‌వి.సుబ్బారావు ఆధ్వర్యంలో ఆయా గ్రామాల ప్రజలు ఆదివారం ఐడీసీ డీఈ నవీకాంత్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. నాగార్జున సాగర్ ఆయకట్టు చివరి ప్రాంతమైన జాన్‌పహాడ్, కల్మేట్‌తండా, దర్గా, చెరువుతండా, కొత్తతండా గ్రామాలకు ఏటా తాగు, సాగునీటి కష్టాలు తప్పడంలేదని వివరించారు. సమస్య పరిష్కారానికి కృష్ణానదిపై ఏర్పాటు చేస్తున్న లిఫ్ట్ ద్వారా చెరువుకు నీటిని తరలించాలని, చెక్‌డ్యాంకు మూసీ నది నుంచి లిఫ్ట్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పుట్ట వెంకటేశ్వర్లు, కూరపాటి కోటయ్య, కాటూరి పుల్లారావు, నాగండ్ల ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, సైదామస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

మోతె: ఇందిరమ్మ ఇండ్ల సర్వే వేగవంతం చేయాలని మోతె ఇన్‌చార్జి ఎంపీడీఓ ఆంజనేయులు అన్నారు. ఆదివారం మోతె మండలంలో జరుగుతున్న ఇండ్ల సర్వేను ఆయన పరిశీలించారు. రావిపహాడ్,సిరికొండ, మామిళ్లగూడెం, నామవరం గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సర్వే కార్యక్రమాన్ని మంగళవారం వరకు పూర్తి చేయాలన్నారు.

## నేడు, రేపు సైన్స్ ఎగ్జిబిషన్

మఠంపల్లి: మండలంలోని మట్టపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని నాగార్జునా సిమెంట్స్ పరిశ్రమ ఆధీనంలో గల ఎన్‌సీఎల్ హైస్కూల్, జూనియర్ కాలేజీలో సోమ, మంగళవారం సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ పూర్ణచందర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శాస్త్ర ,సాంకేతిక విద్య పట్ల విద్యార్థులు మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఈ ఎగ్జిబిషన్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మండలంలోని విద్యార్థులంతా హాజరై ఎగ్జిబిషన్‌ను పరిశీలించాలని కోరారు.

## ఘనంగా లక్ష తులసీ దళాల పూజ



లక్ష తులసీ దళాలు తీసుకు వస్తున్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలోని శ్రీ ఆదివరహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా లక్ష తులసీ దళాల పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, సేవాకాలం, ఆరాధన, మంగళ శాసనం, గోదాదేవి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, అనంతరం కుంకుమార్చన, వడి బియ్యం, అమ్మవారికి పల్లకిసేవ, ఆరగింపు తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో అలయ చైర్మన్ యరగాని గురవయ్యగౌడ్, ఈఓ ఎంపీ లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ రాధికాఅరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, మంత్రిప్రగడ లక్ష్మీవెంకటేశ్వరారవు, కార్యదర్శి అర్చకులు ముడుంబై హరీష్‌కుమార్‌చార్యులు తదితరులు పాల్గొన్నారు.

## కూచిపూడిలో మట్టి రవాణా టిప్పర్ల అడ్డగింత



కూచిపూడి గ్రామస్తులు అడ్డుకున్న టిప్పర్లు

కోదాడరూరల్ : మండల పరిధిలోని కూచిపూడి శివారులోని ప్రభుత్వ భూమి నుంచి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న టిప్పర్లను ఆదివారం గ్రామస్తులు అడ్డుకుని ఆందోళనకు దిగారు. విషయాన్ని రెవెన్యూ అధికారులు, పోలీసులకు తెలపడంతో వారు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే మట్టి వ్యాపారులు టిప్పర్‌లు, ప్రొక్లెయిన్‌లను వదిలేసి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ గ్రామరెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 542, 543, 544లోని ప్రభుత్వ ఏనెలు, గుట్టల నుంచి వారం రోజులుగా ఇష్టానుసారంగా మట్టిని తవ్వి టిప్పర్‌లలో తరలించి రియల్‌ఎస్టేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. అటువైపు పొలాలకు వెళ్లే రైతుల డొంకదారులను సైతం ఆక్రమించుకుంటున్నారని, ఇదేంటని ప్రశ్నిస్తే అధికార పార్టీ నాయకుల అండదండలతో బెదిరిస్తున్నారని వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వ గుట్టలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో శెట్టి సురేష్, శెట్టి రమేష్, ముత్యం సతీష్, వెంకటనారాయణ, చంద్రయ్య, సత్యనారాయణ, గోపి, తిరపతయ్య, మట్టయ్య ఉన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

గరిడేపల్లి: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో హిందీ(సీఆర్టీ) తాత్కాలిక ఉపాధ్యాయ పోస్టు ఖాళీగా ఉందని ఎంఈఓ చత్రునాయక్ ఆదివారం తెలిపారు. ఉపాధ్యాయ పోస్టుకు సంబంధిత సబ్జెక్టులో డిగ్రీ, బీఈడీ అర్హత కల్గిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. ఆసక్తి కల్గిన అభ్యర్థులు మండల విద్యాధికారి కార్యాలయంలో ఈ నెల 31వరకు దరఖాస్తులు అందజేయాలని కోరారు.

## కొనసాగుతున్న ధనుర్మాసోత్సవాలు



వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

మేళ్లచెరువు : ధనుర్మాసోత్సవాల్లో భాగంగా మండలకేంద్రంలోని శ్రీ గోదా భూనీళా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం,రామాలయం నందు ఆదివారం పూజలు చేశారు. ఉదయం గోపూజ, నిత్యార్చన, తిరుప్పావై పాశుర విన్నపం నివేదన, మంగళ నీరాజనం మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు నరగిరి నాథుని రంగభట్టాచార్యులు, తరుణ్ దత్తు, కొంకపాక రాధాకృష్ణమూర్తి, శర్మ, నక్క కొండారెడ్డి, ఈఓ శంభిరెడ్డి పాల్గొన్నారు.

## తైక్వాండోతో శారీరక ఆరోగ్యం, స్వీయ రక్షణ



తైక్వాండో శిక్షకులతో సీఐ చరమంద రాజు

హుజూర్‌నగర్ : తైక్వాండో వల్ల శారీరక ఆరోగ్యం, స్వీయ రక్షణ, క్రమశిక్షణ అలవడుతుందని సీఐ చరమంద రాజు అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్‌లో తెలంగాణ స్టేట్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో థైక్వాండో కోచ్ అంబేద్కర్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. కార్యక్రమానికి సీఐ ముఖ్య అతిథిగా హాజరై తైక్వాండో బెల్టులను ప్రదానం చేసి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తప్పనిసరిగా వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో థైక్వాండో ఎగ్జామినర్ అనిల్ కుమార్, జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఇంచార్జి సెక్రెటరీ కోచ్ అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

నడిగూడెం : రానున్న నూతన సంవత్సరం సందర్భంగా సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్‌ఐ జి.అజయ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. మొబైల్‌కు ఆకర్షణీయమైన న్యూ ఈయర్ గ్రీటింగ్స్ అంటూ, సోషల్ మీడియాలో విస్త ృతంగా ప్రకటనలు ఇవ్వడం, వాట్సాప్, టెలీగ్రామ్ గ్రూపులలో లింక్‌లు వస్తుంటాయని, తొందరపడి క్లిక్ చేయవద్దని, ఓటీపీలు చెప్పవద్దన్నారు. ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలన్నారు.

**● పోలీస్‌స్టేషన్‌కు సెంట్రీడాగ్**



మునగాల పోలీసుస్టేషన్ గేటు దిమ్మెపై ఓ వీధి శునకం ఆదివారం రాత్రి కూర్చొని కాపలా కాస్తున్నట్లుగా ఉంది. పోలీసుస్టేషన్‌కు సెంట్రీగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న శునకం ఫోజును స్థానికులు సెల్‌ఫోన్‌లో బంధించి సోషల్‌మీడియాలో పోస్టు చేయడంతో చెక్కర్లు కొడుతోంది. –మునగాల

## నడిగూడెంలో ఇందిరమ్మ ఇళ్ల సూపర్ చెక్

నడిగూడెం : సర్వేలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల సూపర్ చెక్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సయ్యద్ ఇమామ్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో 14మంది ఇందిరమ్మ ఇళ్లను యాప్‌లో ఫొటోలు తీసిన అనంతరం ఆయన విలేకరులకు తెలిపారు. గతంలో మొదటి సారిగా నమోదు చేసిన వివరాలను సూపర్ చెక్ కార్యక్రమాన్ని రెండోసారి నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.



నడిగూడెంలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల ఫొటో తీస్తున్న ఎంపీడీఓ ఇమామ్

## ఘనంగా మాసశివరాత్రి పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

గరిడేపల్లి: మండల పరిధిలోని కీతవారిగూడెం గ్రామంలోని శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో మాస శివరాత్రి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా పురోహితులు రాయప్రోలు రామయ్య, ఉపేందర్‌లు మహాన్యాస పూర్వకంగా ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చనము, సహస్ర నామార్చనము, అమ్మవారికి కుంకుమపూజ, నవ విధహారతులు, విశేష పుష్పాలంకరణ లక్ష్మీగణపతి రుద్ర నవగ్రహ వాస్తు హోమములు , పూర్ణాహుతి మొదలగు కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

## ఘనంగా మాసకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మేళ్లచెరువు: మండల కేంద్రంలోని శ్రీ ఇష్టకామేశ్వరీ సమేత స్వయంభూ శంభులింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మాసకల్యాణం నిర్వహించారు. స్వామివార్ల విగ్రహాలను అలంకరించారు. పుణ్యాహవచనం, పంచామృతాభిషేకం, మహా న్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో ఈఓ కొండారెడ్డి, అర్చకులు కొంకపాక విష్ణువర్ధన్ శర్మ, ధనుంజయశర్మ, శంభిరెడ్డి, నర్సింహారావు, కొండారెడ్డి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

## ఎలక్ట్రానిక్ స్టోర్ సందర్శన

నడిగూడెం : మండల పరిధిలోని కరివిరాల మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్ విద్యార్థులు రిటైల్ వృత్తి విద్య కోర్సులో భాగంగా ఆదివారం కోదాడ పట్టణంలోని బజాజ్ ఎలక్ట్రానిక్ స్టోర్‌ను సందర్శించారు. పాఠశాల ప్రిన్స్‌పాల్ సాయి ఈశ్వరి మాట్లాడుతూ పారిశ్రామిక పర్యటనలతో విద్యార్థులకు ప్రయోగపూర్వకంగా అర్థమవుతుందన్నారు. కార్యక్రమంలో వృత్తి విద్య ఉపాధ్యాయులు మధు, విజయవాణి, పరుశరామ్, అంబేద్కర్, పిచ్చయ్య, వ్యాయామ అధ్యాపకుడు నాగయ్య ఉన్నారు.

### సంక్షిప్త సమాచారం

**అల్లర్లు సృష్టిస్తే చర్యలు తీసుకుంటాం**

పాలకవీడు: నూతన సంవత్సర వేడుకల పేరుతో అల్లర్ల సృష్టించి, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ లక్ష్మీనర్సయ్య ఆదివారం ఆయన ఒక ప్రకటనలో హెచ్చరించారు. డిసెంబరు 31 అర్ధరాత్రి ఒంటిగంట తరువాత రోడ్లపై కనిపిచవద్దన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, వాహనాలు నడిపినా, మైనర్లకు వాహనాలు ఇచ్చినా, బైక్‌పై ముగ్గురు ప్రయాణించినా, గట్టిగా అరుస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.వేడుకలు కుటుంబంతో కలిసి సంతోషంగా నిర్వహించుకోవాలని సూచించారు.

**చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నరసింహారావు**

కోదాడరూరల్ : రాష్ట్ర చేనేత ఐక్యవేదిక ఉపాధ్యక్షుడిగా కోదాడకు చెందిన కొంగర నరసింహారావు నియమితులయ్యారు ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన చేనేత ఐక్యవేదిక సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయనతో పాటుమరికొందరికి జిల్లా కార్యవర్గంలో చోటుదక్కింది. జిల్లా ప్రచార కార్యదర్శిగా గొర్రె రాజేష్ , కార్యదర్శులుగా పిచిలక కోటయ్య, చిట్టిప్రోలు కనకయ్య, నక్కచంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు. వారిని రాష్ట్ర కార్యదర్శి సంగిశెట్టి గోపాల్ ఆధ్వర్యంలో సన్మానించారు.

## ఎమ్మెల్సీగా రవీందర్‌ను గెలిపించుకుందాం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ శాసన మండలి అభ్యర్థిగా పూల రవీందర్‌ను గెలిపించాలని పలు ఉపాధ్యాయ సంఘ నాయకులు అన్నారు. ఆదివారం హుజూర్ నగర్‌లో జరిగిన వివిధ ఉపాధ్యాయ సంఘాల డివిజన్ స్థాయి సమావేశంలో పలువురు మాట్లాడారు. ఉపాధ్యాయ సంఘాల అభ్యర్థి పూల రవీందర్‌ని మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని కోరారు. అనంతరం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, శ్రీనివాస రావు, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, కె శ్రీనివాస్, మాబాష, శివయ్య, జయరాం, నరసింహారావు, మైసయ్య, అంజయ్య, రాంబాబు, సతీష్ పాల్గొన్నారు.

### రూ.10వేలు ఫోన్‌పే చేయించుకొని పరారీ

కోదాడరూరల్: రూ.10వేలు ఫోన్‌పే చేయించుకుని గుర్తుతెలియని వ్యక్తి పరారయ్యాడు. ఈ ఘటన కోదాడ పట్టణంలో ఆదివారం జరిగింది. కోదాడ పట్టణంలోని నాగార్జున లాడ్జి ఎదుట ఎయిర్‌టెల్ షోరూంలోకి గుర్తుతెలియని వ్యక్తి వచ్చి రూ.10వేలు ఫోన్‌పే చేయవా క్యాష్ ఇస్తా అని మరో వ్యక్తిని అడిగాడు. సదరు వ్యక్తి ఫోన్‌పే చేశాడు. ఇంతలో గుర్తుతెలియని వ్యక్తి డబ్బు కొంత తక్కువగా ఉంది బయట ఆటోలో ఉన్నాయి తీసుకొస్తా అని బయటకు వెళ్లి అనంతగిరి రోడ్డు వైపు పరారయ్యాడు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

### మాదక ద్రవ్యాలు వినియోగిస్తే చర్యలు

హుజూర్‌నగర్ : నూతన సంవత్సర వేడుకల్లో మాదకద్రవ్యాలు వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ చరమంద రాజు హెచ్చరించారు. గంజాయి కేసుల్లో ఉన్న వ్యక్తులకు, డీజే యజమానులకు ఆదివారం హుజూర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో కౌన్సిలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఐ జి ముత్తయ్య పాల్గొన్నారు.

## ఇంటర్నేషనల్ త్రోబాల్ జట్టులో కొత్తూరు వాసి



బహుమతితో అన్నపురెడ్డి లిషిత

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన అన్నపురెడ్డి లిషిత ఇంటర్నేషనల్ త్రోబాల్ పోటీల్లో పాల్గొంది. ఇండియా – శ్రీలంక దేశాల మధ్య తమిళనాడు వేదికగా ఆదివారం త్రోబాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో భారత మహిళా జట్టు ఘన విజయం సాధించింది. ఇండియా జట్టుకు అన్నపురెడ్డి లిషితరెడ్డి ఎంపికై దేశం తరఫున ఆడి ఘన విజయంలో పాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు తల్లిదండ్రులు అన్నపురెడ్డి శిల్ప– గోవర్ధన్‌రెడ్డి, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

## డ్రెయినేజీ పూడికతీత పనులు ప్రారంభం



పనులు చేయిస్తున్న వెంకటాచారి

కోదాడరూరల్ : మండల పరిధిలోని కాపుగల్లు 1వ వార్డులో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ స్థానికులు ఇటీవల ఆందోళన చేశారు. స్పందించిన అధికారులు, నాయకులు ఆదివారం డ్రెయినేజీ పూడిక తీత పనులను ప్రారంభించారు. డ్రెయినేజీ పనులు పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే పద్మావతి రూ.3లక్షలు మంజూరు చేసినట్టు కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటాచారి తెలి పారు. కార్యక్రమంలో రేవూరి వెంకటాచారి, ముత్తవరపు మురళీ, మీగడలింగయ్య, కాసాని అప్పారావు, బొడ్డు వీరబాబు, బాలేబోయిన వెంకటేశ్వ ర్లు, గోవర్ధన్, అన్నపూర్ణ, ఉపేందర్ ఉన్నారు.